ప్రజాశక్తి
గురువారం 27 మార్చి 2025
5
కర్నూలు

'గుండ్రేవుల, వేదవతి'ని చేపట్టాలి

- కర్నూలులో తాగునీటి సమస్య పరిష్కరించండి
- సిఎం దృష్టికి తెచ్చిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణం తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ఈమేరకు ఈ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కోరిన వాటిలో ముఖ్యమైన అంశాలు.

నీటి సమస్య పరిష్కారం: గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. పందికోన రిజర్వాయర్ మరమ్మతులు చేస్తే 40 వేల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. ఆర్డీఎస్ కుడి కాలువ గురించి కూడా సిఎం దృష్టికి తీసుకువెళ్లారు.

కర్నూలు అభివృద్ధి: కర్నూలు నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం, ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కర్నూలును స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడానికి 24గంటలు నీటి సరఫరా ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వ్యవసాయం, పరిశ్రమలు: పత్తి, కంది, వేరుశనగ, మిల్లెట్ పంటల ఉత్పత్తి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పత్తికొండ, గోనెగండ్లలో పోస్ట్ హార్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. పుచ్చకాయలమాడలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ప్లాంట్, జియో మైసూర్ కంపెనీల నిర్మాణాలు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. బనవాసిలో టెక్స్‌టైల్ పార్క్స్ ఏర్పాటుకు భూమి గుర్తించామన్నారు. 315 మెగావాట్ల విండ్ ఎనర్జీ పవర్ ప్రాజెక్ట్, 1680 మెగావాట్ల పంప్డ్ హైడ్రో సోలార్ పవర్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

ఉపాధి, విద్య: యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి కర్నూలు పోర్టల్ సిద్ధం చేశామన్నారు. మద్దికెర, చిప్పగిరి మండలాలు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో అవార్డులు సాధించాయి. వర్చువల్ స్టూడియో ద్వారా పాఠాలు బోధించడం, యూట్యూబ్ చానెల్ ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రత్యేకంగా 10 వ తరగతి విద్యార్థుల పై శ్రద్ధ తీసుకున్నామన్నారు.

పెంచిన ఇంటి పన్ను రద్దు చేయకపోతే..

మరో పోరాటం

- మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలి
- ప్రజాచైతన్య యాత్రలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి
- కర్నూలు కార్పొరేషన్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర కార్పొరేషన్ అధికారులు పెంచిన ఇంటి పన్నులను రద్దుచేయకపోతే గతంలో కల్లూరు కాలనీలో ఇంటి పన్నులు పెంచినప్పుడు చేసిన పద్ధతుల్లోనే ఇంటి పన్నులకు వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, జి.రామయ్య హెచ్చరించారు. బుధవారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు సిపిఎం పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టింది. 11 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయానికి న్యూ సిటీ, ఓల్డ్ సిటీ, శివారు కాలనీల ప్రజలు భారీగా తరలివచ్చారు. 'ప్రజా సమస్యలను పట్టించుకోని పాలకులు, అధికారుల వైఖరి నశించాలి, కమిషనర్ వచ్చి సమాధానం ఇచ్చేంతవరకు కదిలేది లేదని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదని ప్రజలు భీష్మించారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌస్‌దేశాయ్, పి.నిర్మల మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో మార్చి 8 నుండి ప్రజా చైతన్య యాత్ర పేరుతో నగరంలోని వివిధ వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నామన్నారు. మా దృష్టికి వచ్చిన సమస్యలను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కారం చేయాలని తెలిపారు. పెంచిన ఇంటి పన్నులను రద్దుచేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం మున్సిపల్ పరిధిలో 196, 197 ,198 జీవోలను తెచ్చి ప్రతి సంవత్సరం 15 శాతం ఇంటి పన్నులు పెంచేలా చేసిందని ఆనాడు ఆ జీవోలను వ్యతిరేకించి, మేము అధికారంలోకి వస్తే తక్షణమే రద్దు చేస్తామన్న చంద్రబాబు ఆ జీఓలను అలాగే కొనసాగించడం చూస్తే వైఎస్.జగన్, నారాచంద్రబాబు పాలనకు తేడాలేదనిపిస్తోందని విమర్శించారు. 198 జీఓను తక్షణమే రద్దు చేయాలన్నారు. విస్తరించిన కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. రద్దయిన క్లాప్ ఆటోలను తిరిగి పునరుద్ధరించాలని, కాలనీల్లో చెత్త సేకరణ వేగంగా చేయాలని అన్నారు. మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఎన్ఆర్‌పేట, కొత్తపేట, ప్రకాష్ నగర్ లాంటి కాలనీలతో పాటు కొత్తగా విస్తరించిన కాలనీల్లో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీ, పార్కుల సమస్యలను పరిష్కరించాలన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి అందరికీ ఇళ్లను అప్పగించాలని కోరారు. ధర్నా వద్దకు వచ్చిన అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. వివిధ కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంగా పరిష్కరిస్తామని, మా పరిధిలో లేనివి ప్రభుత్వానికి తెలియజేసి వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అంజిబాబు, నగర నాయకులు ఇ.పుల్లారెడ్డి, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, విజయ్, షరీఫ్, అబ్బాస్, రామకృష్ణ, నగేష్, ఎస్ ఎ. సుభాన్, గురు శేఖర్, శేషాద్రి, అలివేలమ్మ, అరుణ, కరణ్యం, వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు, శివారు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆయా కాలనీల ప్రజలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అదనపు కమిషనర్‌కువినతిపత్రం ఇస్తున్న గౌస్‌దేశాయి, నిర్మల, రామయ్య

ఆర్‌యులో పెత్తనం వారిదే

- ముగ్గురు ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్లు..?
- సుప్రీంలో కేసు ఉన్నప్పటికీ నిర్ణయం

ప్రజాశక్తి- కర్నూల్ కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీలోని ఉన్నతాధికారులు కోర్టులో కేసులు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయి. సదరు ప్రొఫెసర్లు కీలక పోస్టుల్లో కూడా వ్యవహరిస్తూ ఇప్పటికీ వర్సిటీలో చలామణి కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాల్లో వర్సిటీలు నిబంధనలను పాటించకుండా చేపట్టారు. ఈ కేసును గతంలో హైకోర్టు విచారించి సదరు ప్రొఫెసర్ల నియామకాలు చెల్లవని తీర్పు ఇచ్చింది. ప్రొఫెసర్లు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరుగుతున్నా రాయలసీమ వర్సిటీలో మాత్రం వారికి ఇంక్రిమెంట్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం గమనార్హం. కేసులో విచారణ ఎదుర్కొంటున్న ప్రొఫెసర్లకు లబ్ధి చేకూర్చేలా వర్సిటీ ఉన్నతాధికారులు అనుసరిస్తున్న వ్యవహార శైలి పలు అనుమానాలకు దారితీస్తుంది. ప్రొఫెసర్లకు కేటాయించిన ఇంక్రిమెంట్లను నిలిపివేసి తగు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించిన విసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీలో మరమ్మతులు చేపట్టిన ఇండోర్ స్టేడియాన్ని బుధవారం వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని కోరారు. ఇండోర్ స్టేడియాన్ని విద్యార్థులు ,అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కూడా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. క్రీడలలో భాగస్వామ్యం కావడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శివ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియాన్నిప్రారంభిస్తున్న విసి

సెంటుకు రూ.50 వేలు ఇవ్వాలి

- ఎక్కువ భూమి పోయిన వారికి ఉద్యోగమివ్వాలి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ
- రైతులతో సమావేశమైన అధికారుల బృందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ పారిశ్రామిక వాడకు నీటిని అందించేందుకు చేపట్టిన పైపుల నిర్మాణ పనుల్లో నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అధికారులను కోరారు. రైతులకు ఒక్కో సెంటుకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని, పది సెంట్ల కన్నా ఎక్కువ భూమి పోయిన రైతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పైపుల నిర్మాణ పనుల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టర్, జెసికి విన్నవించడంతో స్పందించి బుధవారం కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయంలో పూడిచెర్ల, కేతవరం, గార్గేయపురంలలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ సందీప్ కుమార్, కర్నూలు తహశీల్దార్ రమేష్ బాబు, ఓర్వకల్లు డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన రెడ్డి సమక్షంలో సమావేశం జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కేతవరం, పూడిచెర్ల, గార్గేయపురం రైతులు పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల హబ్‌ను ఏర్పాటు చేసిందని, వాటికి నీటి అవసరాల కోసం ముచ్చుమర్రి ఎత్తిపోతల కాలువ నుండి భారీ పైపులైన్ తీసుకొస్తున్నారన్నారు. వచ్చే దారిలో గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల గ్రామాల రైతుల పొలాలు పోతున్నాయని, 2022 లో ప్రభుత్వ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. మా భూములు ఇవ్వలేమని, మాకు అన్యాయం జరుగుతుందని రైతులు అర్జీ ఇచ్చారన్నారు. ఆ తర్వాత గ్రామాలలో రైతులతో ఎటువంటి గ్రామసభ జరపకుండా రైతుల అనుమతి తీసుకోకుండా పైపులైన్ పనులను తీసుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పనులను పూర్తి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు పనులను రైతులు అడ్డుకున్నా, అధికారులు, ఆర్‌డిఒను కలిసి రైతుల మొర విన్నవించినా ఏమాత్రం స్పందించలేదని విమర్శించారు. ఈ మధ్యకాలంలో జెసిని కలిసి రైతులకు ఉన్న ఇబ్బందులను సమస్యలను విన్నవించగా తక్షణమే రైతులతో సమావేశం జరపాలని రైతుల అభిప్రాయాలను తీసుకోవాలని ఆడిఒను ఆదేశించారన్నారు. రైతుల అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. రైతులు మాట్లాడుతూ మా భూములలో పైపులైన్ వేసిన తర్వాత భారీ రాళ్లు మట్టినిభూముల వెంబడి వదిలేశారని వాటిని తొలగించాలంటే ఒక రైతుకు రూ.60 వేల నుండి రూ.70 వేల దాకా ఖర్చు అవుతుందన్నారు. ఆ భూమి మళ్ళీ సాగులోకి రావాలంటే 14, 15 సంవత్సరాలు అవుతుందని వాపోయారు. రైతులు ముక్తకంఠంతో మా భూములకు సెంటుకు రూ.50 వేలు ఇవ్వాలని, 10 సెంట్ల కంటే ఎక్కువ భూమి పోయిన రైతుల కుటుంబాల్లో ఒక ఉద్యోగం ఇచ్చి ,మా పొలాలను ఇబ్బందులు లేకుండా చదును చేయడానికి అయ్యే ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల గ్రామాలలో ఉన్న నీటి కుంటలు, చెరువులకుపైపులైనుకు మోటర్లు బిగించి నీళ్లు నింపాలని డిమాండ్ చేశారు. పనులు చేసే సందర్భంగా రోడ్డు పక్కనే భారీ గోతులు తీయడంతో కేతవరం రైతు మేకల రంగస్వామి రూ.లక్ష విలువగల ఆవు గుంతలో పడి చనిపోయిందని, వీటి పైన కాంట్రాక్టర్ , ఉన్నతాధికారులందరికీ విన్నవించినా స్పందించలేదని, చనిపోయిన ఆవు రైతు మేకల రంగస్వామికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులు స్పందించి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి డిమాండ్లన్నిటిని తీసుకువెళ్లి తప్పనిసరిగా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు నాగన్న, శ్రీధర్ రంగస్వామి, బుగ్గ రాముడు ,కుర్వమధు గార్గేయపురం వెంకటేశ్వర్లు ఆరోగ్యం తమ్ముడు, కుమారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

28న 'మీ సమస్య - మా పరిష్కారం'

- రాష్ట్ర మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 28న 'మీ సమస్య - మా పరిష్కారం' అనే కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నారు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన ప్రజలందరూ 'మీ సమస్య - మా పరిష్కారం'నికొచ్చి సమస్యలు విన్నవించుకోవాలని మంత్రి టీజీ భరత్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రి కార్యాలయంలోని శ్రీఆర్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. కర్నూలు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం కోరింది.

హంద్రీ నదిపై ఆగిపోయిన బ్రిడ్జిని పూర్తి చేయాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా సిపిఎం బృందం గోరంట్ల గ్రామాన్ని సందర్శించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోరంట్ల గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి హంద్రీ నదిలో పిల్లర్లను లేపి అంతటి తోనే వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వం హంద్రీ నదిపై నిర్మాణంలో ఆగిపోయిన బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం మండల నాయకులు గఫూర్ మియా, జిపి వీరన్న డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే క్రిష్ణగిరి మండలం వెల్దుర్తి మండలం నుండి కోడుమూరుకు రావాల్సిన వారికి అలాగే మంత్రాలయం ఎమ్మిగనూరు ఆదోని కి వెళ్లడానికి మంచి అవకాశం ఉంది. ఆ గ్రామాలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం లేక హంద్రీలో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఈ నిర్మాణం పూర్తయితే గ్రామాల ప్రజలే కాదు రైతాంగానికి కూడా పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. గోరంట్ల మజర గ్రామమైన కొత్తపల్లిహంద్రి అవతలనే ఉందని, గోరంట్ల రైతుల పొలాలు ఎక్కువ శాతం హంద్రీ అవతలనే ఉన్నాయని, బ్రిడ్జి నిర్మాణాన్ని వీలైనంత తొందరలో పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో ప్రధాన రహదారి డ్రెయినేజీ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని, గ్రామంలో కొన్నిచోట్ల సిసి రోడ్లు కూడా సరిగ్గా లేవని, రోజురోజుకు గ్రామ జనాభా పెరుగుతున్నదని, జనాభాకు అనుగుణంగా ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇండ్లు నిర్మించాలని కోరారు. వెల్దుర్తి కోడుమూరు ప్రధాన ఆర్ అండ్ బి రహదారి ని నిర్మించాలని కోరారు. సిపిఎం నాయకులు మునుస్వామి, స్థానిక నాయకులు నరేష్, మాదన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కోడుమూరు సిపిఎం నాయకులు

పేద ముస్లిం మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ముస్లింలకు రంజాన్ పవిత్రమైనది

నిత్యావసరాలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినం పరమ పవిత్రమైనదని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీ గురుదత్త పాలి క్లినిక్ లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కింద నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ఇస్లాం క్యాలెండర్లో 9వ నెలలో వస్తుందని తెలిపారు. ఇదే మాసంలో మహమ్మద్ ప్రవక్తకు భగవంతుడు తెలియజేశారని, ఈ మాసం నుండి మహమ్మద్ ప్రవక్త ఖురాన్ బోధించడం ప్రారంభించారని చెప్పారు రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస ఉండటం వలన వారికి శరీరంపై, మనసుపై నియంత్రణ కలుగుతుందన్నారు. రంజాన్ పర్వదినం రోజు పండుగను సంతోషంగా జరుపుకోవాలని కర్నూలు నగరంలోని పేద ముస్లిం మహిళలకు తాను నిత్యవసర వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రపంచంలోని ప్రతి ముస్లిం సోదర,సోదరీమణులు రంజాన్ పర్వదిరాన్ని ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ మాసంలో చేసే దాన, ధర్మాల వల్ల వారికి అంతా మంచి జరుగుతుందని తెలిపారు. ఎన్నో మతాలు భిన్న సంస్కృతులకు మన దేశం నిలయమని, ప్రపంచంలో ఏ దేశంలో ఇలాంటి వైవిధ్యం లేదని చెప్పారు.

సీఎం సహాయనిధి పేదలకు ఒక వరం

ప్రజాశక్తి-పత్తికొండ..

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి ఒక వరం లాంటిదని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే సీఎం సహాయ నిధికి అర్హులైన 14 మంది బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. రూ10 లక్షల 93,600 మంజూరు అయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధితులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్‌కు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంకుమార్

ఐసిఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిల్వర్‌జూబ్లీ గవర్నమెంట్ కాలేజీలో ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ , వారి ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో గ్రామీణ కమ్యూనికేషన్ ఉపాధి అవకాశాలు పరివర్తన వ్యూహాలు సాధికారపరచడంపై సదస్సులో చర్చించారు. గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ వృత్తి విద్య శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి , స్థానిక అవసరాలకు అనుగుణంగా మెరుగు పరుచుకోవాలన్నారు. దీనిని జెటీర్ ఇంటర్ నేషనల్ మ్యాగజైన్స్ లో కూడా ప్రచురించారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సిల్వర్ జూబ్లీ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్. కుమార్ , సిల్వర్ జూబ్లీ కాలేజీ కన్వీనర్ డాక్టర్ జి.ఎల్లాకృష్ణ,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్

ఉదయం ఏడు గంటలకే పనిప్రదేశంలో ఉండాలి

ఎంపిడిఒ రాణెమ్మ

ప్రజాశక్తి- సి బెళగల్

ఉదయం ఏడు గంటలకే పని ప్రదేశంలోకి వెళ్లాలని ఎంపిడిఒ రాణెమ్మ ఉపాధి కూలీలకు సూచించారు. బుధవారం ఎపిఒ రామన్న అధ్యక్షతన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎండలు మెండుగా ఉన్నందున ఉష్ణోగ్రత తీవ్రతరంగా ఉందని, వేళలు పాటించి ఉదయం 11 కల్లా ఇళ్లకు చేరుకోవాలని అన్నారు. ఒక వేళ వడ దెబ్బ కొట్టినా అశ్వస్థతకు గురి అయినా ఒఆర్ఎస్ పాకెట్లు నీటిలో కలుపుకొని తాగి ఉపశమనం పొందాలన్నారు. అనంతరం శ్రమశక్తి సంఘాలకు ఒఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు.

ఒఆర్ఎస్ ప్యాకెట్లుపంపిణీచేస్తున్నఎంపిడిఒ రాణెమ్మ

పేదల సొంతింటి కళ నెరవేర్చిన రమణమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్‌లోని మమతా నగర్‌లో సిపిఎం మాజీ కార్పొరేటర్ ఐద్వా జిల్లా నాయకురాలు జి. రమణమ్మ 12వ వర్ధంతి సభ మమతానగర్ పార్టీ నాయకులు దేవన్న అధ్యక్షతన నిర్వహించారు. వర్ధంతి సభలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి .రాముడు, జిల్లా కమిటీ సభ్యులు కె. అరుణ, ఎన్. అలివేలు, పార్టీ సీనియర్ నాయకులు జి. మద్దిలేటి, ఐద్వా నాయకురాలు టి.బాలలక్ష్మి, రేణుకలు ముందుగా జి .రమణమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడం కోసం అహర్నిశలు కృషిచేసిన ప్రజా నాయకురాలు జి .రమణమ్మ అని అన్నారు. పేపర్ మిల్లు ఉద్యమం నుండి సిపిఎం ఉద్యమ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన రమణమ్మ తుదిశ్వాస వదిలే వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా వదలలేదని అన్నారు. ఐద్వా నాయకురాలుగా అంచలంచలుగా ఎదుగుతూ జిల్లా అధ్యక్షురాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. సిపిఎం తరుపున కార్పొరేటర్ గా గెలిచి ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు రోడ్లు, డ్రెయినేజీ, కాలవలు వీధిలైట్లు, స్త్రీల మరుగుదొడ్లు ఇంటి పట్టాల కొరకు ఏనలేని కృషిచేశారన్నారు. నరసింహ రెడ్డి నగర్ అశోక్ నగర్ లేబర్ కాలనీ భగత్ సింగ్ నగర్ సీతారాం నగర్, రామలింగేశ్వర్ నగర్ మొదలగు ప్రాంతాలలో ప్రజలకు అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. రమణమ్మ ఆశయాల కోసం మనం మన శక్తి కొద్ది కృషి చేయాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు దావీదు ,శంకరయ్య, కాజా, శాంతమ్మ, ఎల్లమ్మ, కృష్ణవేణి స్థానిక కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రమణమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాముడు ఇతర నాయకులు

అభివృద్ధి కోసం సర్వ సభ్యసమావేశం

ప్రజాశక్తి-సి బెళగల్ :

మండలంలో సొసైటీ సేవలు మరింత అభివృద్ధి వైపు నడిపించేందుకే సర్వ సభ్య సమావేశాలు అందు బాటులోకి వచ్చాయని సొసైటీ చెర్మన్ , సొసైటీ ప్రత్యేక అధికారి జయాకర్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు సొసైటీ బ్యాంకు మేనేజర్ నాగ మద్దిలేటి, సి బెళగల్ సొసైటీ సిఇఒలు రవి రెడ్డి, ఖాజా, లక్ష్మన్న ల సమక్షంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించి ఆయా గ్రామాల రైతులతో, సభ్యత్వం దారులతో సమీక్షించారు. ఇక్కడే సొసైటీ సామాజిక తనిఖీ జరిగితోందని , ప్రతి సభ్యత్వం కలిగిన వారి వివరాలు, రుణగ్రస్తుల జాబితాను ఇకపై ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేశామని తెలిపారు. మే నెల నుండి వచ్చే ఖరీఫ్ కు రుణాలు సకాలంలో అందిస్తామని, ఎరువులు మందులు విత్తనాలు కూడా అందిస్తామని అన్నారు. జిల్లాకు ఏడు సొసైటీ జన ఔషధి కేంద్రాలు మంజూరు కాగా అందులో సిబెళగల్ లో ఒకటి ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. అందుకే సామాన్యులకు తగ్గట్టుగా ఔషద మందులు అందుబాటులో ఉన్నాయని అందుకోవాలని పేర్కొన్నారు. ఫార్మాసిస్టు వెంకటేష్,సిబ్బంది శేఖర్, శివ పాల్గొన్నారు.



విద్యుత్ షాక్ బుక్ విడుదల చేస్తున్న నాయకులు

సెకీ, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సెకీ, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం వచ్చినా ప్రజలకు విద్యుత్ షాక్ తప్పడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయం ముందు 'విద్యుత్ షాక్' అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని కోరారు. సెకీ ఒప్పందం రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని.. సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన బాబు మాట తప్పారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ చార్జీలు పెంచరాదని కోరుతూ ఈనెల 28న విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.గోపాల్, మండల కార్యదర్శి వర్గసభ్యులు డి.రామాంజనేయులు, పట్టణ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాల కల్పన

- ఎంపిడిఒ అల్లా బకాష్

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ పనులు చేసుకునే దగ్గర వడదెబ్బకు గురికాకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ఉపాధి సిబ్బంది కూడా సహకరించాలని ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వేతనాలు సకాలంలో అందుతున్నందున గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరైన అవగాహన కల్పిస్తూ పనులకు వెళ్లేలా కృషి చేయాలని తెలిపారు. వేతనాలు కూడా ఖాతాలకు జమ అవుతున్నాయని చెప్పారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే వారందరూ త్వరగా పూర్తి చేసుకుంటే సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని ఏపీవోకు సూచించారు. వడదెబ్బకు గురికాకుండా పనులకు ఉదయం 6 గంటలకే వెళ్లేలా ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడా విడతల వారీగా మంజూరు అవుతాయన్నారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం అందజేత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

చెక్కులు అందజేస్తున్న సబ్ కలెక్టర్

వన్య ప్రాణుల ఘర్షణలో పశువులను కోల్పోయిన రైతులకు చెక్కుల రూపంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిహారం అందజేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అటవీ శాఖ అధికారులతో కలిసి బాధిత రైతులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని డివిజన్ పరిధిలోని 2023-24, 25 సంవత్సరంలో వన్య ప్రాణుల ఘర్షణలో పశువులను కోల్పోయిన 14 మంది రైతులకు రూ.1,79,600 చెక్కులు అందజేశామన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కడితోటలో రీసర్వేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ర్యాలీలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని కడితోట గ్రామంలో తహశీల్దార్ శివ రాముడు ఆధ్వర్యంలో బుధవారం సమగ్ర భూ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తోందని, భూమి కలిగిన ప్రతి ఒక్కరూ భూమి స్థితిగతులను తెలియజేసే దస్తావేజులు, వివరాలు తెలుపుతూ సర్వే చేయించుకోవాలని రైతులను కోరారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. డిఐఒఎస్ సూర్య, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పల్లెల్లో నీటి దాహం

- అల్లాడుతున్న ప్రజలు..!
- అధికారుల నిర్లక్ష్యం
- ప్రజా సమస్యలు పట్టని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో నీరు లేక గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. నీటి దాహాన్ని తీర్చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీటి సమస్యతో గ్రామంలో చాలా వీధి ప్రజలు సతమతమవుతున్నా నాయకులు మాత్రం పట్టించుకోవడం లేదు.

నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

నందవరం గ్రామంలో చాలా వీధుల్లో నీరు లేక ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. గ్రామంలో ఎటు చూసినా నీటి సమస్యలే కనిపిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి కోసం కుళాయి దగ్గర పడిగాపులు కాస్తూ.. వీధివీధినా తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. 14వ వార్డు ఎస్సీ కాలనీ ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని నెలలుగా నీరు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూటర్లపైనా, తోపుడు బండ్లపైనా సుమారు కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే 6, 7వ వార్డుల్లో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. వీధిలో ఉన్న కుళాయిల్లో సుమారు 6 కుళాయిలు నీరు రాక బంద్ అయ్యాయి. 30 ఏళ్ల క్రితం వీధుల్లో పైపులైన్లు లేక, కుళాయి సదుపాయాలు లేక సరైన నీటి సదుపాయాలు ఉండేవి కావు. వీధిలో ఒకటో, రెండో కుళాయిలు ఉండేవి. అప్పుడు చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చేది. గత కొంతకాలంగా కాలానికి అనుగుణంగా నాయకులు వీధిలో కొన్ని కుళాయిలను ఏర్పాటు చేసి నీటి సమస్యలను కొద్ది వరకు తీర్చారు. ప్రస్తుతం ఈ ఏడాది 30 ఏళ్ల క్రితం అనుభవించిన నీటి సమస్యలను తలపిస్తున్నాయని వీధి పెద్దలు పేర్కొంటున్నారు. వీధిలో చాలా కుళాయిలు నీరు రాక బంద్ అయ్యాయి. వీధిలో జనాభా పెరగడం వల్ల పారే కొన్ని కుళాయిలు సరిపోవడం లేదు. వచ్చే కుళాయిలు కూడా చిన్నగా రావడంతో చేతిపంపులను వినియోగించి నీటిని తీసే పరిస్థితి ఏర్పడింది. వీధిలో ఏర్పడిన నీటి ఎద్దడిపై అధికారులు, నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నీటి సమస్యపై ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే త్వరలోనే ఖాళీ బిందెలతో ర్యాలీగా చేరుకొని కార్యాలయాల దగ్గర ధర్నాలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

- పరం పోగు సురేష్, నందవరం

అధికారులు వీధిలో ఏర్పడిన నీటి సమస్యపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఎన్నిసార్లు తెలిపినా స్పందించడం లేదు. మా సమస్యను తీర్చండంటూ అధికారులను ప్రాధేయపడినా ఒక్కరు కూడా స్పందించి సమస్యను తీర్చలేకపోయారు. అడిగిన ప్రతిసారీ ఏదో ఒక సాకు చెబుతున్నారు. సమస్యపై దృష్టి సారించే ఆలోచన కూడా అధికారులు చేయడం లేదు.

ప్రజా సమస్యలు పట్టని నాయకులు

- ఎస్.సంధ్య, నందవరం

వీధిలో ఎప్పుడూ లేనివిధంగా నీటి ఎద్దడి ఏర్పడినా నాయకులు మాత్రం సమస్యను పట్టించుకోవడం లేదు. మొన్న జరిగిన ఎన్నికల ప్రచారంలో నాయకులు ఇంటింటికి కుళాయి ఇస్తామని వాగ్దానాలు చేశారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికి కుళాయి మాట ఏమో తెలియదు కానీ, ఉన్న కొళాయిలు కొన్ని నీరు రాక పూర్తిగా బంద్ అయ్యాయి. నీటి సమస్యను నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరం.

ఆహారం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

- ప్రతిభ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి - కౌతాళం

ప్రదర్శన శాలను పరిశీలిస్తున్న దూద్ బాష

ఆహారం, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ప్రతిభ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్ పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలి, ఆహారపు నియమాలపై ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 3వ తరగతి విద్యార్థులు బుధవారం (ఫుడ్ కోర్ట్) తినుబండారు ప్రదర్శన శాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం మనం ఉరుకులు పరుగులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, సమయం లేక ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు, జంక్ ఫుడ్‌కు చేరువై ఆరోగ్యాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నామని తెలిపారు. సమయాన్ని కేటాయించుకొని ప్రోటీన్స్, విటమిన్లు, మినరల్స్ గల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు, బాయిల్డ్ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వీటి వల్ల ఆరోగ్యం బాగుంటుందని విద్యార్థులు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివరించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పర్యవేక్షకులు జయలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల సంతపై ఎందుకంత ప్రేమ..?

- గుత్తేదారులు జయరామ్, చిట్టి బాబు, రవి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌పై లేని ప్రేమ పశువుల సంతపై ఎందుకని గుత్తేదారులు జయరామ్, చిట్టి బాబు, రవి ప్రశ్నించారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ వేలం వేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ అధికారులు వేలం తేదీలు ప్రకటించి గుత్తేదారులు తక్కువ మంది టెండర్లు వేశారని ఒకసారి వాయిదా వేశారని తెలిపారు. మరోసారి సంవత్సరానికి రూ.76 లక్షలు కేటాయించడం పట్ల టెండర్ దక్కించుకున్న వారికి గిట్టుబాటు లభించదని వాకౌట్ చేసి నిర్ణీత ధర తగ్గించాలని కోరినట్లు చెప్పారు. మున్సిపల్ అధికారులు మాత్రం ససేమిరా అనడంలో రాజకీయ రంగు పులుముకుందని అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఇదే పశువుల సంతపై గతంలో కేవలం 8 నెలలకే రూ.21.60 లక్షలు ఉండగా, ఈ ఏడాది కేవలం రూ.లక్ష పెంచి రూ.22.60 లక్షలకు అప్పగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తాము న్యాయంగా అడుగుతున్నా టెండర్‌కు పిలువకుండా మౌనంగా ఉండడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. గతంలో చెల్లించిన రూ.21.60 లక్షలను సంవత్సరానికి సరాసరి నెలకు రూ.2 లక్షలు అయితే ఇప్పుడు 12 నెలలకు ఇంకా తక్కువ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ ఎక్కువ ధర పెంచడం ఏమిటో స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ పునరాలోచించి త్వరగా టెండర్ పిలిపించి ఆదాయానికి గండి కొట్టకుండా చూడాలన్నారు. వీరేష్, నారాయణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గుత్తేదారులు

ప్రజా సమస్యలపై పోరు

- మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరు బాట పట్టింది. ప్రజా చైతన్య యాత్రలో తెలుసుకున్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు వీరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడారు. ఆదోని అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే పార్థసారథికి చిత్తశుద్ధి లేదన్నారు. మాటలు తప్ప చేతల్లో చూపడం లేదని విమర్శించారు. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని తెలిపారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కౌన్సిల్ సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పట్టణం నడిబొడ్డున కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫ్లైఓవర్ బ్రిడ్జిని పునర్ నిర్మించాలని కోరారు. కల్లుబావి శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించి నీటి సౌకర్యం కల్పించాలని, అరుణ్ జ్యోతి నగర్‌లో స్త్రీలకు మురుగుదొడ్లు నిర్మించాలని, మైనార్టీ కాలనీకి రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదోని ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్ఐ, సిటి స్కాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనుపమకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వీరేష్, వెంకటేష్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, అజీమ్ ఖాన్, మల్లయ్య, రాజు పాల్గొన్నారు. **గోనెగండ్ల** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు నబి రసూల్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, శాఖ కార్యదర్శి బి.కరుణాకర్ మాట్లాడారు. అర్హులైన ప్రజలందరికీ 3 సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల రుణం ఇవ్వాలని కోరారు. అనంతరం వ్యక్తిగత అర్జీలతోపాటు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు ఇచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ... మండలంలో ప్రభుత్వ స్థలాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఉన్నచోట గుర్తించడంతోపాటు లేనిచోట ప్రభుత్వానికి నివేదిక పంపి ల్యాండ్ అక్యుపేషన్‌కు పెట్టి అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. దేవదాసు, ఖాజా, దాసు, నరసింహుడు, మునెప్ప, వెంకటేశ్వరమ్మ, అజీజ్ మియ్యా, రాజు పాల్గొన్నారు. **ఆలూరు**లోని గుంతకల్లు రోడ్డు వైన్ షాప్ ఎదురుగా జనావాసాలు లేని చోట రోడ్డును ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి మాట్లాడారు. ఆలూరులో జనావాసాలు లేనిచోట సిసి రోడ్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మండలంలో ఉపాధి హామీ చట్టం కింద సిసి రోడ్ల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, ఆలూరుకు రూ.50 లక్షలు మంజూరయితే వచ్చిన నిధులను ప్రజలు ఉన్నచోట తిరిగే చోట కాకుండా జనావాసాలు లేని చోట రోడ్లు వేసి ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేపడితే అధికారులు నిద్రలో ఉన్నారా అని ప్రశ్నించారు. ఆలూరు సిద్దేశ్వర నగర్, సిపిఎం కాలనీ, ఎల్ఐసి ఆఫీస్ వెనుక, ప్రభుత్వాస్పత్రి వెనుక రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు షాకీర్, మైనా, కృష్ణ, విఠల్, వీరేష్, గోవర్ధన్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని పాత ఇందిరానగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సిపిఎం పట్టణ నాయకులు రాముడు పేర్కొన్నారు. పాత ఇందిరానగర్ కాలనీలో సిపిఎం బృందం పర్యటించింది. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందిరానగర్ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. నిర్లక్ష్యం చేస్తే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆదోనిలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోనెగండ్లలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ఆలూరులో...

ఎమ్మిగనూరులో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఐజి కల్యాణి తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని డిఐజి కల్యాణి తనిఖీ చేశారు. ఇంతవరకు నెలసరి లక్ష్యం రూ.32 కోట్లకు గాను రూ.24 కోట్లకు చేరుకోవడంపై సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో పుల్లన అనే వ్యక్తి లైసెన్స్ లేని డాక్యుమెంట్ రైటర్స్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేస్తే గతంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ సునంద పుల్లన్నపై కేసులు బనాయించారు.

28న వీరభద్ర స్వామి, కాళికామాత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రామంలో వెలసిన శ్రీవీరభద్ర స్వామి, కాళికామాత ఉత్సవాలు ఈనెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు సర్పంచి తిమ్మక్క, ఆలయ కార్యనిర్వహణ అధికారి రాంప్రసాద్ బుధవారం తెలిపారు. 28న ధ్వజారోహణ, 29న ప్రత్యేక పూజలు, 30న ఉగాది పండగ, 31న పిడకల సమరం, ఏప్రిల్ 1న తెల్లవారుజామున 4.05 గంటలకు వీరభద్ర స్వామి, కాళిక దేవీల కల్యాణోత్సవం, 2న హోమం, 3న సాయంత్రం రథోత్సవం, 4న పూజ కార్యక్రమం, 5న వసంతోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సాటుసారా నిర్మూలనే లక్ష్యం

- ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

నాటుసారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం 'నవోదయం 2.0'ను నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. బుధవారం నాటు సారా తయారీ గుర్తించిన గ్రామాల్లో ప్రచార రథంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. దొడ్డి బెళగల్, పెద్దకడబూరు మండలం మేకడోనా, ముచ్చుగిరి, కల్లుకుంట, హెచ్.మురవణి, హనుమాపురం గ్రామాల్లో అవగాహన చేపట్టారు. బెల్లం అమ్మకాలపై దుకాణదారులతో సూచనలు చేశారు.

పోటాపోటీగా నామినేషన్ల పర్వం

- ఏప్రిల్ 2న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు నామినేషన్లను పోటాపోటీగా దాఖలు చేశారు. బుధవారం పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, న్యాయవాదులు విజయ భాస్కర్ రెడ్డి, సోమశేఖర్ మాట్లాడారు. ఏప్రిల్ 2న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదోని బార్ అసోసియేషన్ కార్యవర్గానికి రెండు ప్యానెల్‌గా ఏర్పడ్డారన్నారు. సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి మధ్యన అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు ఉంటాయని చెప్పారు. బార్ అసోసియేషన్‌లో ఎన్నికల అధికారులుగా విజయ భాస్కర్ రెడ్డి, సోమశేఖర్, హనుమేష్, న్యాయవాదులు రెండు ప్యానల్ నుంచి నామినేషన్లు స్వీకరించారు. ప్రెసిడెంట్‌గా శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి మధ్య, వైస్ ప్రెసిడెంట్‌గా జె.వెంకటేశ్వర్లు, లోకేష్ కుమార్ మధ్య, జనరల్ సెక్రటరీగా ఎల్‌కె.జీవన్ సింగ్, బి.నెట్టకంటయ్య మధ్య పోటీ ఉంటుంది. జాయింట్ సెక్రటరీగా రాజారత్నం, కలందర్ బాష మధ్య పోటీ ఉంటుందన్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల విత్ డ్రా ఉంటుందన్నారు. ఏప్రిల్ 2న ఆదోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఓటింగ్ ఉంటుందని వివరించారు. న్యాయవాదులు వైఆర్.మల్లికార్జున, అంజనప్ప, సుందర్ సింగ్, వీరేష్, దేవరాజ్ ఉన్నారు.

నామినేషన్లు స్వీకరిస్తున్న అధికారులు

సర్వే గ్రౌండ్ వాల్యుయేషన్‌పై గ్రామసభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్ర ప్రభుత్వం గోనెగండ్ల పంచాయతీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో భాగంగా గ్రౌండ్ వాల్యుయేషన్‌కు సంబంధించి బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామ సభ నిర్వహించారు. తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ... గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం పూర్తయిందని, ప్రస్తుతం భూముల విస్తీర్ణానికి సంబంధించి గ్రౌండ్ వాల్యుయేషన్‌పై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 25 వరకు రైతులు పొలాల పట్టాదారు పాసు పుస్తకం, రిజిస్టర్ పత్రాల జిరాక్స్ కాపీలతో తహశీల్దార్ కార్యాలయ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో హాజరై పొలాల విస్తీర్ణాలను నిర్ధారించుకోవాలని సూచించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరాజు, రీసర్వే డిటి శిరీష, మండల సర్వేయర్ హమీద్ బాష, సర్వేయర్లు సందీప్, కృష్ణమూర్తి, విఆర్‌ఒలు కిషోర్, రంగముని, మల్లికార్జున పాల్గొన్నారు.

వేలం ద్వారా పంచాయతీకి పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

దినసరి, వారపు సంత మార్కెట్ వేలం పాట ద్వారా గ్రామ పంచాయతీకి గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.43,500 ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వారపు సంత మార్కెట్‌ను నరసయ్య రూ.49 వేలకు చేజిక్కించుకోగా ఈఏడాది మళ్లీ ఆయనే రూ.65,500కు పాడి కైవసం చేసుకున్నారు. ఇక దినసరి మార్కెట్ వేలం పాటను గతేడాది ఆనంద్ అనే వ్యక్తి రూ.93 వేలకు దక్కించుకోగా ఈఏడాది రూ.1.20 లక్షలకు సాల్మన్ సొంతం చేసుకున్నారు. వేలం పాట ద్వారా మేజర్ పంచాయతీకి రూ.43,500 ఆదాయం పెరిగిందని ఇఒఆర్‌డి ప్రభావతి తెలిపారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి పాల్గొన్నారు.

నవోదయకు 'జీనియస్ గ్లోబల్' విద్యార్థి

- రాఘవేంద్ర కోచింగ్ సెంటర్‌లో శిక్షణ

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్ర కోచింగ్ సెంటర్‌లో నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ పొందిన జీనియస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి కంసాలి జితేంద్ర నవోదయ విద్యాలయానికి ఎంపికయినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్, రాఘవేంద్ర నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎస్.రాఘవేంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఈఏడాది స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న స్థానిక వీర బ్రహ్మయ్య కుమారుడు జితేంద్ర రాఘవేంద్ర నవోదయ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నాడని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉత్తమ శిక్షణ ఇచ్చి విద్యార్థులను తమ కోచింగ్ సెంటర్ ద్వారా అభివృద్ధి చెందేలా చూస్తామని పేర్కొన్నారు. ఇక ముందు కూడా ఇదే విధంగా నవోదయ నిర్వహించే ప్రవేశ ఫలితాల్లో రాణించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. నవోదయ విద్యాలయంలో సీటు సాధించిన విద్యార్థి జితేంద్రను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రుతి కరణం, శ్రీరాఘవేంద్ర నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎస్.రాఘవేంద్ర అభినందించారు.

'నవోదయ'లో విక్టరీ సునామి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన విక్టరి నవోదయ శిక్షణ కేంద్రం నుంచి 47 మంది ఎంపికయ్యారని శిక్షణ కేంద్రం డైరెక్టర్ చాంద్ బాష తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడారు. వరుసగా గత 22 ఏళ్లుగా కర్నూలు జిల్లాలోనే గాక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ఎవరికీ సాధ్యం కాని సీట్లను సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రంలో కొన్ని అనువాద దోషాలు ఉన్నప్పటికీ ఈఏడాది మరింత మంచి ఫలితాలు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావం వల్లనే ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఫలితాలు తమలో మరింత బాధ్యతను పెంచుతున్నాయని తెలిపారు. అతి తక్కువ ఫీజుతో ఎమ్మిగనూరు చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతున్నామని చెప్పారు. గత వారంలో జరిగిన వినుకొండ వారి శర్మ ఐఐటి ఫౌండేషన్ స్కూల్‌కు తమ శిక్షణ కేంద్రం నుంచి 35 మంది విద్యార్థులు ఉచిత వర్క్ షాపునకు ఎంపికయ్యారని తెలిపారు. అకాడమిక్ సలహాదారు ఖాజా బాష, ఉపాధ్యాయులు వికాస్, పాపన్న, ఖాజా మోయినుద్దీన్, రాజశేఖర్, అంజలి, బాలరాజు, అన్సర్, ఎఒ రజని, హాస్టల్ నిర్వాహకులు కంబగిరి స్వామి, గౌరి, మహాలక్ష్మి, పుణ్యవతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తొలి అడుగు

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వినతులు స్వీకరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వస్తున్న ఆరోపణలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఇంటి వద్దే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసి వినతులు స్వీకరిస్తున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. దరఖాస్తుదారులు ఇచ్చిన అర్జీలను 7 రోజుల నుంచి 10 రోజుల్లో పరిష్కరించే సమస్యలను 3 నుంచి 6 నెలల సమయం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారుల వరకు అందరినీ అనుసంధానం చేస్తూ ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరించి వాటి స్థితిగతులు తెలుసుకొని ఆన్‌లైన్ ద్వారా సంక్షిప్త సందేశం ఇస్తామని రాఘవేంద్రరెడ్డి తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - కౌతాళం

మాట్లాడుతున్న నాయకులు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి గ్రామాభివృద్ధి కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈనెల 29న టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలోనూ నాయకులు, కార్యకర్తల సమక్షంలో టిడిపి జెండా ఎగుర వేయాలని కోరారు. నాయకులు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, పట్టాభి, సౌద్రి బసవరాజు, యువ నాయకులు సురేష్ నాయుడు, హాల్వి సిద్ధప్ప, రామలింగన్న, డాక్టర్ రాజానంద్, జనసేన మండల నాయకులు రామాంజినేయులు, మారెప్ప, కురువ ఈరన్న, లక్కే గోవిందు, గిరి, ముక్కన్న, తిక్కయ్య, రంగస్వామి, నరసన్న, ఈరన్న, అల్లయ్య, గుండప్ప, రామన్న గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

దేవర ఉత్సవాల్లో ప్రముఖులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో జరిగిన మారెమ్మ దేవర ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు పూజలు చేశారు. బుధవారం పత్తికొండ ఎమ్మెల్యే శ్యాం కుమార్, టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ శివ ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు మల్లేపల్లి సుంకన్న కుమారుడు రంగడు ఆహ్వానం మేరకు దేవర ఉత్సవాల్లో వారితో పాటు మండల నాయకులు పాల్గొన్నారు. నల్లచెలిమిల గ్రామంలో జరిగిన మారెమ్మ ఉత్సవాల్లో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ కుమారుడు గిరిమల్లేష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.